క్లుప్తంగా

నేడు వైద్య శిబిరం

ఉప్పునుంతల: స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో సోమవారం ఉదయం 11 గంటలకు స్వచ్ఛత హీ సేవ- 2024 కార్యక్రమంలో భాగంగా మండలంలోని గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న పారిశుద్ధ్య సిబ్బందికి వైద్య శిబిరం నిర్వహిస్తునట్లు ఎంపీడీఓ మోహన్‌లాల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని పారిశుద్ధ్య సిబ్బంది వైద్య పరీక్షలు చేయించుకోవాలని కోరారు.

వృథాగా సాగునీరు



వెల్దండ: మండల కేంద్రంలోని లచ్చపూరం చెరువు సమీపంలో డీ-82 కాల్వకు నెల రోజుల కిందట గండి పడింది. కేఎల్ఐ కాల్వలో భాగంగా డీ-82 కాల్వ ద్వారా వెల్దండ, గుండాల, చొక్కన్నపల్లి, భర్కత్‌పల్లి, చెర్కూర్ గ్రామాలకు సాగునీరు అందాల్సి ఉంది. కాల్వకు గండి పడడంతో కేఎల్ఐ కాల్వ ద్వారా వచ్చే నీరు వృథాగా వెళ్తోంది. గండి పూడ్చకపోవడంతో ఆయా గ్రామాల రైతులు ఆందోళన చెందుతున్నారు. 10 రోజుల కిందట కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పరిశీలించి కాల్వకు పడిన గండి పూడ్చాలని అధికారులకు ఆదేశించారు. కాని నేటికి పనులు పూర్తి చేయకపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

విద్యుత్ స్తంభాల ఏర్పాటు



కల్వకుర్తిరూరల్: మండలంలోని మార్చాలలో ఆదివారం నూతనంగా విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయడంతో పాటు మరమ్మతు చేపట్టారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఆదేశాల మేరకు విద్యుత్ శాఖ అధికారులు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న పనులను చేపట్టారు. గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీధర్ రెడ్డి, మాజీ వార్డు సభ్యులు భాస్కర్, కాంగ్రెస్ నాయకులు పనులను పర్యవేక్షించారు.

పశుసంపదను కాపాడుకుందాం

వెల్దండ: పశుసంపదను కాపాడుకుందామని ఇన్‌చార్జ్ డాక్టర్ శ్రీనాథ్ పేర్కొన్నారు. ఈనెల 30 నుంచి మండలంలో పశువులకు గాలికుంటు టీకాలను పంపిణీ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆదివారం మండలంలోని కేస్లీతండా, మర్రిగుంతతండాల్లో టీకాలను వేసినట్లు పేర్కొన్నారు. పశువైద్య అధికారులు బృందాలుగా ఏర్పడి పశువులకు టీకాలను వేస్తునట్లు వివరించారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మామిడిపూత మందులపై అవగాహన

కోడేరు: మండలంలోని నర్సాయిపల్లి గ్రామ రైతు వేదికలో మామిడి తోటల పూత దశలో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులపై 1న అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఉద్యానవన అధికారి లక్ష్మణ్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని రైతులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

రేపు కాటన్‌మిల్లు ఎన్నికలు

కల్వకుర్తిరూరల్: మండలంలోని మార్చాల సమీపంలో ఉన్న సూర్యలత కాటన్‌మిల్లు గుర్తింపు సంఘం ఎన్నికలు అక్టోబర్ 1న నిర్వహించనున్నారు. సూర్యలత స్పిన్నింగ్ మిల్లు గుర్తింపు ఎన్నికల కోసం ఆనంద్‌కుమార్, సూర్యప్రకాశ్‌రావులు పోటీలో ఉన్నారు. మొత్తం 450 ఓట్లు ఉన్నాయి. ఇరువురు నాయకులు శక్తివంచన లేకుండా ప్రచారం నిర్వహించారు. మిల్లులోని క్వాటర్స్‌లో ఉన్న వారి ఓట్లు కీలకంగా మారాయి. ఆనంద్ కుమార్ అధికార పార్టీ అండదండలతో తన ప్రచారం ఉధృతంగా నిర్వహిస్తున్నారు. పార్టీ నాయకులు, కార్మికులు ప్రచారంలో పాల్గొంటూ కార్మికులను కలుస్తున్నారు. సూర్యప్రకాశ్ రావుకు బీఆర్ఎస్ నాయకులు అండగా నిలుస్తున్నారు. మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, మాజీ వైస్ ఎంపీపీ గోవర్ధన్, మాజీ మార్కెట్ చైర్మన్ విజయ్‌గౌడ్‌తో పాటు బాలయ్య, ఆయా గ్రామాల బీఆర్ఎస్ నాయకులు అండదండగా నిలుస్తూ కార్మికులను ఓట్లు అడుగుతున్నారు. ఎన్నికలు సమీపించడంతో 2 రోజుల కిందట కార్మికులను ఇరువురు నాయకులు విహారయాత్రలకు పంపించారు.

జిల్లా అధ్యక్షుడిగా కోదండరాములు ఎంపిక

నాగర్‌కర్నూల్‌రూరల్: జిల్లా కేంద్రానికి చెందిన కోదండరాములును ఏవీఓపీఏల జిల్లా అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు ఎం శంకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

సీహెచ్‌సీలో వైద్యులు కరువు

- మంజూరుకాని డాక్టర్లు, సిబ్బంది పోస్టులు
- అవస్థలు పడుతున్న రోగులు



డాక్టర్లు లేక గదులకు తాళం



ఉప్పునుంతలలో అధునాతన వసతులతో నిర్మించిన సీహెచ్‌సీ ఆస్పత్రి భవనం

ఉప్పునుంతల: మండల కేంద్రంలో కోట్ల రూపాయలు వెచ్చించి సీహెచ్‌సీ (కమ్యూనిటీ హెల్త్ సెంటర్)ని నిర్మించడంతోపాటు ఏడాది కిందట ఆస్పత్రిని ఆర్భాటంగా ప్రారంభించినా సీహెచ్‌సీ స్థాయిలో రోగులకు వైద్య సేవలు మాత్రం అందని ద్రాక్షగానే మారాయి. సీహెచ్‌సీకి అన్ని వసతులతో కూడిన అధునాతన భవనం నిర్మించి జిల్లా స్థాయిలో లేనటువంటి అన్ని విభాగాలకు సంబంధించిన పరికరాలు సమకూర్చినా డాక్టర్లను, సిబ్బందిని నియమించకపోవడంతో ఏమాత్రం ఫలితం లేక ప్రజలకు వైద్య సేవలు అందడంలేదు. సీహెచ్‌సీలో స్థానికంగా మెరుగైన వైద్య సేవలు అందుతాయని ఆశపడిన ప్రజలు నిరాశకు లోనవుతున్నారు. ఇంతకుముందు మాదిరిగానే పీహెచ్‌సీ స్థాయిలోనే ఓపీ వైద్య సేవలు అందుతున్నాయి. సీహెచ్‌సీకి డిప్యూటేషన్‌పై ఆరునెలల కిందట ఒక డాక్టర్‌ను నియమించినా తర్వాత ఆ డాక్టర్‌ను ఇతర ఆస్పత్రికి కేటాయించారు. ప్రస్తుతం ఇద్దరు స్టాఫ్ నర్సులను డిప్యూటేషన్‌పై నియమించి వంతుకుగం తేసినట్లు ఆస్పత్రిని కొనసాగిస్తున్నారు. వారితోపాటు ఏజెన్సీ కాంట్రాక్టర్‌కు సంబంధించిన 12 మంది కాంటిజెన్సీ సిబ్బంది పనిచేస్తున్నారు.

రూ. 5.80 కోట్లతో సీహెచ్‌సీ..

గత బీఆర్ఎస్ ప్రభుత్వం టీఎస్ఎంఎస్ఐడీసీ ఎండీగా కొనసాగిన చంద్రశేఖర్‌రెడ్డి చొరవతో ఆయన స్వంత ఊరైనా ఉప్పునుంతల మండల కేంద్రానికి సీహెచ్‌సీని మంజూరు చేశారు. తెలంగాణ ప్రభుత్వం వైద్య ఆరోగ్య. కుటుంబ సంక్షేమ శాఖ ద్వార ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రెటరీ నుంచి 2018 సెప్టెంబర్ నెలలో జీఓ నంబర్ 145 ద్వార ఉప్పునుంతల పీహెచ్‌సీని సీహెచ్‌సీగా స్థాయి పెంపునకు ఉత్తర్వులు జారీ చేశారు. 30 పడకల సీహెచ్‌సీ (కమ్యూనిటీ హెల్త్ సెంటర్)గా స్థాయి పెంచడానికి రూ. 5,80 కోట్లతో పనులు చేపట్టడానికి పరిపాలన అనుమతులు మంజూరు చేశారు. వాటిలో కొత్త ఆస్పత్రి భవన నిర్మాణానికి రూ. 3,80 కోట్లు, పరికరాల కొనుగోలుకు రూ. 95 లక్షలు, డాక్టర్లు, సిబ్బంది జీత భత్యాల కోసం రూ. 1.05 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. నాలుగేళ్లపాటు సాగదీసి ఆస్పత్రి భవనాన్ని మాత్రం 2023 చివరన నిర్మించి గతేడాది అక్టోబర్‌లో ఎన్నికల ముందు హడావిడిగా ప్రారంభించారు. డెంటల్, చిన్న పిల్లల తదితర అన్ని విభాగాలకు సంబంధించి ఏడు మంది డాక్టర్లు ఉండాల్సిన సీహెచ్‌సీలో ఒక్క డాక్టర్‌ను కూడా నియమించలేదు. కేవలం ఇద్దరు స్టాఫ్ నర్సులను నియమించడంతో వారు ఇతర ప్రాంతాల నుంచి వచ్చి వెళ్తున్నారు. డెంటల్, ఎక్స్‌రే తదితర అన్ని విభాగాలకు సంబంధించిన పరికరాలు వచ్చాయి. కోట్లు ఖర్చుచేసి పెద్దాస్పత్రిని నిర్మించి కావల్సిన పైద్య పరికరాలు సమకూర్చినా సరిపడ డాక్టర్లు, సిబ్బందిని నియమించకపోతే ప్రయోజనం ఏమిటని మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.' సీఎంహెచ్‌సీ కోసం నిర్మించిన భవనంలోనే ప్రస్తుతం పీహెచ్‌సీని కొనసాగిస్తున్నారు. పీహెచ్‌సీలో హోమియోపతి డాక్టర్‌తోపాటు మరో ఇద్దరు డాక్టర్లు పనిచేస్తున్నారు. రోజువారిగా ఆస్పత్రికి వచ్చే రోగులకు స్టాఫ్ నర్సులు వారి స్థాయిలో వైద్య సేవలు అందిస్తున్నారు. వారి స్థాయికి మించిన వైద్యం కోసం అచ్చంపేట ఆస్పత్రికి పంపిస్తున్నారు.

> **కొత్త పోస్టులు మంజూరు కాలేదు**
>
> రాష్ట్రంలో సీహెచ్‌సీలు 30 పడకల ఆస్పత్రిగా స్థాయిని పెంచిన ఆస్పత్రులకు గత ప్రభుత్వం భవనాలు నిర్మించి కావల్సిన పరికరాలను సమకూర్చడం జరిగింది. అందుకు కావల్సిన డాక్టర్లు, సిబ్బంది పోస్టులకు మంజూరు చేయలేదు. ప్రస్తుతం పీహెచ్‌సీ డాక్టర్లు, సిబ్బందితోనే సీహెచ్‌సీలను కొనసాగిస్తున్నాం. సీహెచ్‌సీలో డాక్టర్లు, సిబ్బంది లేని ఇబ్బందులను తరచుగా అన్ని జిల్లాల నుంచి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తున్నాం. ప్రభుత్వం మరో రెండు మూడు నెలల్లో సీహెచ్‌సీలలో డాక్టర్లు, సిబ్బందిని నియమించే అవకాశం ఉంది. అప్పుడు పూర్తిస్థాయిలో ప్రజలకు అన్ని రకాల వైద్య సేవలు సీహెచ్‌సీలలో అందనున్నాయి.
>
> – డాక్టర్ రామకృష్ణ,
> జిల్లా అధికారి, తెలంగాణ వైద్య విధాన పరిషత్

గద్దర్ విగ్రహావిష్కరణకు తరలిరండి



మన్ననూర్‌లో విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

మన్ననూర్: ప్రజా గాయకుడు గద్దర్ విగ్రహావిష్కరణకు అధికసంఖ్యలో తరలిరావాలని ఎమ్మెల్యే వంశీకృష్ణ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. నల్లమలకు ముఖద్వారంగా ఉన్న మన్ననూర్‌లోని అంబేద్కర్ కూడలిలో 15 అడుగుల గద్దర్ విగ్రహాన్ని అక్టోబర్ 5న ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. అలుపెరుగని ఉద్యమ కెరటం, ప్రజా యుద్ధనౌక గద్దర్‌కు నల్లమల ప్రాంతానికి మంచి అవినాభావ సంబంధం ఉందన్నారు. విగ్రహ దాత పొల్లూరి సత్తయ్య ముందుకు రావడం సంతోషకరమన్నారు.

కాంస్య విగ్రహాల ఏర్పాటు చేస్తాం

అమ్రాబాద్, మన్ననూర్, అచ్చంపేట పట్టణ కేంద్రంలో ఇప్పటికే నెలకొల్పబడి ఉన్న భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాల స్థానంలో కాంస్య విగ్రహాలను ఏర్పాటు చేసేందుకు త్వరలోనే ప్రణాళికలు సిద్ధం చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు కల్మూల నాసరయ్య, ఎల్లస్వామి, బుచ్చయ్య, రాంకోటి, మల్లికార్జున్, కాశన్న యాదవ్, మల్లేష్, కృష్ణగోపాల్, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ పని ముట్లు పంపిణీ

స్థానిక పురుగుల గుట్ట వద్ద గిరిజన భవనం ప్రాంగణంలో ఐకార్, జాతీయ జన్యు వనరుల సంస్థ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో 200 చెంచు కుటుంబాలకు వ్యవసాయ పనిముట్లను ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ పంపిణీ చేశారు. ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ వ్యవసాయానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటయ్య, కార్యదర్శి భీముడు శాస్త్రవేత్తలు, ఐకార్ ప్రతినిధులు పీకేసింగ్, డాక్టర్ శివరాజ్, నీలియా చాలమ్, నాయకులు రహీం, హన్మంత్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, వెంకటరమణ, శ్రీనివాసులు, రాజారాం, రాజేంద్రప్రసాద్, శంకరయ్య, మల్లయ్య పాల్గొన్నారు.

అమ్రాబాద్: అన్నివర్గాల అభివృద్ధికి సీఎం రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. పదర రైతు వేదికలో చెంచుల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆధార్ కేంద్రాన్ని ఆదివారం ఆర్‌డీఓ మాధవీలతతో కలిసి ఎమ్మెల్యే సందర్శించి పరిశీలించారు. ఆధార్ కేంద్రం రెండు రోజులు కొనసాగుతుందని చెంచులకు కులం, ఆధార్, జనన తదితర ధ్రువీకరణ పత్రాలు ఉచితంగా ఇచ్చేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. సమావేశంలో తహసీల్దార్ సురేష్‌బాబు, ఎంపీడీఓ బాలచంద్రుడు, రెండు మండలాల కాంగ్రెస్ పార్టీ నాయకులు, చెంచులు పాల్గొన్నారు.

వృథాగా బస్టాండ్



అమ్రాబాద్: మండల కేంద్రంలో ప్రయాణికుల సౌకర్యార్థం బస్టాండ్‌ను నిర్మించారు. కాని ఆర్టీసీ బస్సు డ్రైవర్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ప్రయాణికులను రోడ్డుపైనే ఎక్కించుకుంటున్నారు. కొందరికి తెలియక బస్టాండ్‌లోనే పడిగాపులు కాస్తున్నారు. ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలోకి బస్సులను డ్రైవర్లు తీసుకెళ్లకపోవడంతో ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రయాణికులు బస్సుల కోసం రోడ్డు పక్కనే నిల్చోవాల్సిన దుస్థితి నిలుస్తోంది. వృద్ధులు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. బస్టాండ్ లోకి బస్సులు వచ్చే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అసంపూర్తిగా డ్రైయినేజీ నిర్మాణం



తాడూరు: మండల కేంద్రంలోని ప్రధాన ఆర్అండ్‌బీ రోడ్డు అనుసరించుకుని ఉన్న మురుగు కాలువ నిర్మాణాన్ని అసంపూర్తిగా వదిలారు. పక్కనే పోచమ్మ ఆలయంతో పాటు ప్రభుత్వ జూనియర్ కళాశాల ఉండడంతో తరచుగా రోడ్డు వెంట వెళ్లే ప్రయాణికులతో పాటు విద్యార్థులు కంపువాసన భరించలేకపోతున్నారు. సమస్యను అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం స్థానికులు వాపోయారు. అధికారులు పరిశీలించి అసంపూర్తిగా వదిలిన డ్రైయినేజీ నిర్మాణాన్ని పూర్తి చేయాలని కోరుతున్నారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్



పోటీలను ప్రారంభిస్తున్న స్వాములు

కల్వకుర్తి టౌన్: క్రీడలతో ఉజ్వల భవిష్యత్ ఉంటుందని జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డా.సోలపోగుల స్వాములు అన్నారు. ఆదివారం పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో రాష్ట్ర స్థాయి అథ్లెటిక్ పోటీలకు ఎంపికలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలతో స్నేహపూర్వక వాతావరణం ఏర్పడుతుందన్నారు. అండర్-14, 16, 18, 20 అథ్లెటిక్ క్రీడా విభాగాల్లో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన 200 మంది విద్యార్థులలో 30 మంది పోటీలకు ఎంపికయ్యారని ఆయన తెలిపారు. అక్టోబర్ 7, 8 తేదీల్లో హన్మకొండలోని జేఎన్ స్టేడియంలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రవీందర్ రావు, రామస్వామి, జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ సభ్యులు భిక్షపతి, పరశురాము, అంజయ్య, పీఈటీలు ప్రసాద్, సైదులు, నిర్మల, రాధిక, విద్యార్థులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

పూర్తికావొస్తున్న రహదారి నిర్మాణ పనులు



పెద్దకొత్తపల్లి: కల్వకుర్తి నుంచి నంద్యాల వరకు కొనసాగుతున్న జాతీయ రహదారి నిర్మాణ పనులు మండలంలో పూర్తి అయ్యాయి. రోడ్డు వెంట ఉన్న గ్రామాల్లో రోడ్డుకు ఇరుపక్కల సైడ్ డ్రైన్ నిర్మించి రోడ్డు మధ్యకు రాకుండా గ్రిల్స్ ఏర్పాటు చేశారు. ప్రమాదాలు జరగకుండా ముందస్తుగా చర్యలు తీసుకున్నారు. ప్రస్తుతం మండల కేంద్రంతో పాటు కల్వకోలులో సైడ్ డ్రైన్ పనులు కొనసాగుతున్నాయని అధికారులు పేర్కొన్నారు. అదే విధంగా కొల్లాపూర్, సింగోటం క్రాస్ రోడ్డు వద్ద ఫ్లైఓవర్ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి.

సకాలంలో రుణాలు చెల్లించాలి



మాట్లాడుతున్న చైర్మన్ గుర్వయ్య గౌడ్

చారకొండ: పీఏసీఎస్ సింగిల్‌విండోలో రుణాలు తీసుకున్న రైతులు సకాలంలో చెల్లించాలని సింగిల్ విండో చైర్మన్ జెల్ల గుర్వయ్య గౌడ్ అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం పీఏసీఎస్ కార్యాలయంలో చైర్మన్ అధ్యక్షతన మహాజన సభ నిర్వహించారు. సమావేశానికి డైరెక్టర్లు, మండలంలోని రైతులు, పీఏసీఎస్ ఖాతాదారులు హాజరయ్యారు. సమావేశంలో రైతులకు అందించిన సేవలపై, రుణాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా చైర్మన్ మట్లాడుతూ సకాలంలో రుణాలు చెల్లించిన వారికి మళ్లీ తిరిగి రుణాలు పొందే అవకాశం ఉంటుందన్నారు. సొసైటీలో 656 మంది రుణమాఫీకి అర్హులయ్యారన్నారు. 363 మందికి మొదటి, రెండవ విడతల్లో మాఫీ అయ్యిందన్నారు. సమావేశంలో వైస్ చైర్మన్ కృష్ణారెడ్డి, డైరెక్టర్లు కొండలయ్య, గజన్‌మోహన్, రాజయ్య, సత్యంచ రమేష్, సీఈఓ వెంకటయ్య, రైతులు తదితరులు ఉన్నారు.

వివాహిత అదృశ్యం: కేసు నమోదు

నాగర్‌కర్నూల్ క్రైం: వివాహిత అదృశ్యమైన ఘటనపై ఆదివారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గోవర్ధన్ తెలిపారు. ఎస్ఐ వివరాల ప్రకారం మంతటి గ్రామానికి చెందిన వివాహిత జయమ్మ ఐదు నెలల చిన్నారిని వెంటపెట్టుకొని ఇంట్లో నుంచి శనివారం వెళ్లింది. కుటుంబ సభ్యులు చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికిన ఆమె ఆచూకి తెలియలేదు. జయమ్మ భర్త చిన్నయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తునట్లు ఎస్ఐ తెలిపారు.

వాహనాల తనిఖీ



పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలో మైసమ్మ జాతర నుంచి వచ్చే వాహనాలతో పాటు నాగర్‌కర్నూల్ వెళ్లే వాహనాలను ఆదివారం ఎస్ఐ వి సతీష్ తనిఖీ చేశారు. తనిఖీలలో కానిస్టేబుల్ నరేష్, మల్లేష్, కల్యాణ్ పాల్గొన్నారు.

స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయండి



తూంకుంట, వల్లభాపురం గ్రామాల మధ్య రోడ్డు

వీపనగండ్ల: మండలంలో పలు గ్రామాలకు వెళ్లే రోడ్లలో ప్రమాదకరమైన మలుపులు ఉండడం, వాటికి సూచికబోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదం పొంచి ఉంది. తూంకుంట నుంచి వల్లభాపురం గ్రామానికి వెళ్లే రోడ్డులో ప్రధాన మలుపు ఉండి ప్రమాదం పొంచి ఉంది. అలాగే మండల కేంద్రం నుంచి కల్వరాల, తూంకుంట, సంపత్‌రావుపల్లి, బొల్లారం చౌరస్తా నుంచి కొర్లకుంట గ్రామాల మధ్య పలు చోట్ల ప్రమాదకరమైన మలుపులు ఉండి రోడ్డు గుంతలమయంగా మారడంతో ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. అధికారులు స్పందించి మరమ్మతులు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సగరులు రాజకీయంగా ఎదగాలి



అచ్చంపేట: సగరులు రాజకీయంగా ఎదగాలని సగర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శేఖర్ సాగర్ అన్నారు. ఆదివారం పట్టణంలో ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామ కమిటీలు ఏర్పాటు చేసుకుని స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలన్నారు. సగరులను బీసీ డీ నుంచి బీసీ ఏలోకి మార్చే వరకు పోరాడుతామన్నారు. కార్యక్రమంలో వెంకటయ్య, బాబుసాగర్, ఆంజనేయులు, పద్మయ్య తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు



లింగాల: అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు వస్తుందని ఎస్ఐ జగన్‌మోహన్, సింగిల్ విండో చైర్మన్ హన్మంత్‌రెడ్డి అన్నారు. మండల వ్యవసాయాధికారిగా 12 ఏళ్లుగా పని చేసిన నాగార్జునరెడ్డి అలంపూర్ మండలానికి బదిలీ అయ్యారు. ఈ మేరకు మండల రైతు సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని రైతు వేదికలో ఆదివారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో సింగిల్ విండో మాజీ చైర్మన్ కొండల్‌రావు, మాజీ వైస్ ఎంపీపీ నారాయణగౌడు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నాగేశ్వర్‌రావు, వైద్యాధికారి శివశంకర్, నాయకులు ధర్మారెడ్డి, లక్ష్మణ్‌నాయక్, రాజునాయక్, మాజీ సర్పంచు ఏఈఓలు, ఫెర్టిలైజర్ డీలర్లు, రైతులు పాల్గొన్నారు.

నవరాత్రి ఉత్సవాలను విజయవంతం చేయాలి



నాగర్‌కర్నూల్‌రూరల్: పట్టణంలో నిర్వహించనున్న 54వ దేవీ ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆలయ కమిటీ అధ్యక్షుడు బిల్లకంటి హరిప్రసాద్ విజ్ఞప్తి చేశారు. ఆదివారం స్థానిక కన్యకా పరమేశ్వరి ఆలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా హరిప్రసాద్ మాట్లాడుతూ పట్టణంలోని భక్తులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని వారు ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. అక్టోబర్ 3వ తేదీన మార్కెట్ శివాలయం నుంచి అమ్మవారి విగ్రహాన్ని శోభాయాత్రగా తీసుకువస్తామని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి శోభాయాత్రను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో రాధాకృష్ణ, నారాయణ, నీలకంఠం, పరమేశ్వర్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

2న సుదర్శన్ రావు స్మృతి సంచిక ఆవిష్కరణ కార్యక్రమం

నాగర్‌కర్నూల్‌రూరల్: స్థానిక పట్టణంలోని తిరుమల ఫంక్షన్‌హాల్‌లో బుధవారం 10 గంటలకు పి సుదర్శన్‌రావు స్మృతి సంచిక ఆవిష్కరణ నిర్వహిస్తున్నామని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు వనపట్ల సుబ్బయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ ఉన్నత పాఠశాల నిర్వాహకులు శ్రీపురం మాజీ సర్పంచ్ బుచ్చయ్య, పరిశోధకులు రమేష్‌బాబు, పి సుదర్శన్ తదితరులు హాజరవుతారని పేర్కొన్నారు.

అటెన్షన్ ప్లీజ్






ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్

మండలంలోని రాచూర్ జిల్లా ఉన్నత పాఠశాల గేట్ వద్ద ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా మారింది. విద్యార్థులు పాఠశాల లోపలికి వెళ్లే దారిలో చేతికందే ఎత్తులో ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. అటువైపుగుండా వెళ్లే మూగజీవాలు ప్రమాదాలబారి పడుతున్నాయి. విద్యార్థుల తల్లిదండ్రులు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. అధికారులు స్పందించి ప్రమాద భరితంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించి ఇతర ప్రాంతానికి తరలించాలని స్థానికులు కోరుతున్నారు. – వెల్దండ

సంప్రదించాల్సిన అధికారి: సూర్యం, ఏఈ
ఫోన్ నంబర్: 9440813451

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



తెలకపల్లిలో సమావేశానికి హాజరైన పూర్వ విద్యార్థులు

తెలకపల్లి: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1990-91 విద్యా సంవత్సరంలో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఓ ఫంక్షన్ హాల్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఒకే వేదికపై కలుసుకుని ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకొని ఉద్యోగ, కుటుంబ వివరాలను అడిగి తెలుసుకున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు, బతుకమ్మ ఆటాపాటలతో సందడి చేశారు. పూర్వ విద్యార్థులు నరహరి, నరేందర్, ఇబ్రహీం, మోహనాచారి, రామకృష్ణారెడ్డి, రాములు, రజిత, నాగరాణి, నివేదిత, జ్యోతి, మహేశ్వరితో పాటు 70 మంది పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

వెల్దండ: మండలంలోని పెద్దాపూర్ ఉన్నత పాఠశాలల్లో ఆదివారం 2006-2007 పదో తరగతి విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. అప్పటి గురువులను పూలమాల, శాలువాలతో సన్మానించారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. గురువులు యాదగిరి, జగన్మోహనచారి, శ్యాంసుందర్, రామనాథం, దశరథం, విద్యార్థులు షరీఫ్, జిలాని, భీమరాజు, శ్రీనివాసులు, మల్లేష్, శ్రీనివాస్, పాండు, అశోక్, చంద్రశేఖర్, గీత, పార్వతమ్మ, భీమమ్మ, మంజుల, బాలమణి, లావణ్య, అంజనమ్మ, పరమేశ్వరి, అనిత తదితరులు ఉన్నారు.



వెల్దండ మండలం పెద్దాపూర్‌లో..